క్లుప్తంగా

దెందులూరులో శ్రమకాల ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఫాదర్లు

దెందులూరు: శ్రమకాల ప్రార్థనలు దేవునికి మరింత దగ్గర చేరుస్తాయని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ జి అమ్మన్ రాజా ఆధ్వర్యంలో శ్రమలకాల ప్రార్థనలు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వికార్ జనరల్ మాట్లాడుతూ తపస్కాల దీక్షలు స్వీకరించిన దీక్షాధారులు ఆధ్యాత్మిక చింతన, సేవాభావం కలిగి ఉండాలన్నారు. దేవుని దీవెనలు పొందేలా ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. అనంతరం ఫాదర్లు అమ్మన్ రాజా, ఇంజేపాల్, కే చార్లెస్, కళ్యాణ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం



ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్

ఉంగుటూరు: ఇంటర్మీడియెట్‌లో చేరే విద్యార్థులు ఈనెల 7వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరం తరగతులకు యథావిధిగా మంగళవారం నుంచి హాజరుకావాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ తదితర కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఈనెల 1 నుంచి 23 వరకు బ్రిడ్జికోర్సు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

భీమడోలు: లక్ష్మీపురం సమీపంలోని ఓ పుంతలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.17,020 నగదు, ఒక కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతలకు దళితులంటే చులకన

కామవరపుకోట: తెలుగుదేశం పార్టీ నాయకులు మొదట నుంచి దళితులను చులకన భావంతోనే చూస్తారని జలపవారిగూడెం గ్రామానికి చెందిన దళిత నాయకులు కరుటూరి బాలస్వామి, కరుటూరి మిధున్ చక్రవర్తి, మరికొందరు దళిత నాయకులు సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో దళితులకు సరైన మనుగడ, గుర్తింపు ఉండదని, ఎన్నికల సమయంలోవాడుకుని అధికారంలోకి వచ్చాక వదిలేస్తారని, దళితులను జెండా మోసే కూలీలుగానే గుర్తిస్తారు తప్ప వారికి ఆ పార్టీలో సరైన గౌరవం లభించదని వాపోయారు. అందుకనే టీడీపీలో ఇమడలేక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసి ఇటీవల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కేంద్ర పార్టీ కార్యాలయం తాడేపల్లిలో కలిసి, ఆయన ఎదుట తమ గోడును వెల్లబుచ్చినట్లు వారు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన వై.సుబ్బారావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

115 మందికి వైద్య పరీక్షలు

పోలవరం రూరల్: పోలవరం ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద మండల పెన్షనర్స్ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 115 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి, దంత, జనరల్‌వ్యాధులకు సంబంధించి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కళ్లజోళ్లను అందించారు. మానవత సంస్థ, పెన్షనర్స్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరామర్శ

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొల్లూరి దినేష్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. ఇటీవల దినేష్ తండ్రి రాధాకృష్ణ గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలుసుకున్న తెల్లం బాలరాజు దినేష్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధైర్యపడవద్దని దినేష్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరం.. ప్రయాణికులకు శాపం

- భీమడోలు రైల్వే స్టేషన్‌లో సమస్యల తిష్ట
- ఈ స్టేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టని రైల్వే శాఖ, పాలకులు
- సమస్యలతో ప్రయాణికులు సతమతం

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ అభివృద్ధికి దూరంగా మిగిలిపోతుండడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఈ స్టేషన్ అభివృద్ధిపై రైల్వే శాఖ అధికారులు, పాలకులు దృష్టి పెట్టకపోవడంతో ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఇక్కడి రైల్వే స్టేషన్‌లోని విశ్రాంతి గదిలో యాత్రికులు కటిక నేలపై నిద్రించాల్సిన దుస్థితి. కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఈ రైల్వే స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫామ్‌లు ఉండగా కేవలం రెండు ప్లాట్‌ఫామ్‌లను దృష్టిలో ఉంచుకుని గతంలో నిర్మించిన పుట్‌పాత్ ఓవర్ బ్రిడ్జిని విస్తరించాలని కోరుతున్నారు. మూడో ప్లాట్‌ఫామ్ వద్ద రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలు నిలిపిన క్రమంలో ఆ ట్రాక్‌ను దాటాలంటే ప్రయాణికుల వెతలు వర్ణనాతీతం. వాస్తవానికి రైల్వే స్టేషన్ జాతీయ రహదారికి అనుబంధంగా ఉంటుంది. దీంతో రైలు దిగిన ప్రయాణికులు హైవే వైపునకు రావాలంటే ఖచ్చితంగా పుట్‌పాత్ బ్రిడ్జి నుంచి అవతలకు వెళ్లాలి. కానీ పూర్తి స్థాయిలో బ్రిడ్జి లేనందున వారంతా నరకయాతనను అనుభవిస్తున్నారు. దీనితో వారు గ్రామంలోనుంచి ఇతర వాహనాలపై అదనంగా చార్జీలు చెల్లించి హైవే వద్దకు చేరుకోవాల్సి వస్తుంది. రాత్రి వేళల్లో అయితే వారి బాధలు వర్ణణాతీతం. కొందరైతే ప్రమాదమని తెలిసినా మూడో ఫ్లాట్‌పామ్‌పై నిలిచిన రైలులోంచి దూరి హైవేపైకి వెళ్తుంటారు.

శ్రీవారి భక్తులను దృష్టిలోకి తీసుకోని వైనం

దూరప్రాంతాల నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వెళ్లే రైలు ప్రయాణికులకు భీమడోలు రైల్వేస్టేషన్ సౌకర్యవంతంగా ఉంటుంది.



భీమడోలు రైల్వే స్టేషన్‌లో మూడో ఫ్లాట్‌ఫామ్ వరకు లేని పుట్‌పాత్ బ్రిడ్జి

గతంలో కొన్ని రైళ్లు ఇక్కడ ఆగేవి. కరోనా సమయం నాటినుంచి రద్దు చేయడంతో యాత్రికులకు కష్టాలు తప్పడం లేదు. ఈ స్టేషన్‌లో సింహాద్రి, తిరుమల, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ ఇచ్చారు. కరోనా సమయంలో రద్దు చేసిన కాకినాడ -తిరుపతి రైలును ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైలుగా పునరుద్ధరించినా భీమడోలులో హాల్ట్ ఇవ్వలేదు. ఇక్కడ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను సైతం తొలగించారు. వాస్తవానికి భీమడోలు రైల్వే స్టేషన్‌లో ద్వారకాతిరుమల వెళ్లే భక్తుల కోసం దశాబ్దాల కితం సూచిక బోర్డులను అప్పటి రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. కానీ ఆదిశగా అభివృద్ధి చర్యలు చేపట్టడం లేదు. ఇదిలా ఉండగా చేబ్రోలు రైల్వే స్టేషన్‌లో వివిధ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని, అభివృద్ధి చేయాలని సంబంధిత పాలకులు రైల్వే శాఖను కోరారు. దీనితో భీమడోలు రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆటకెక్కినట్లేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అన్నవరం తరహాలో భీమడోలు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి వసతులు కల్పించాలని, ట్రైన్ కోచ్ స్థానాలు తెలియజేసే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని ఈ ప్రాంతవాసులు ఇటీవల ఏలూరు వచ్చిన రైల్వే శాఖ జీఎంను కలిసి కోరారు.

సమస్యలను రైల్వే జీఎం దృష్టికి తీసుకువెళ్లాం



భీమడోలు రైల్వేస్టేషన్‌లోని సమస్యలపై రైల్వే జీఎం అరుణకుమార్‌కు వివరించాం. మూడు ట్రాక్‌లకు పుత్‌పాట్ వంతెనను నిర్మించాలని కోరాం. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరాం. పుట్‌పాత్ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వారు పడే ఇబ్బందులను వివరించాం. సమస్యలపై జీఎం సానుకూలంగా స్పందించారు.

– టీవీ ఉమామహేశ్వరరావు, మానవత జిల్లా డైరెక్టర్, భీమడోలు



రాత్రి వేళల్లో మూడో ఫ్లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న గూడ్స్ రైలు



స్టేషన్‌లోని విశ్రాంతి గదిలో కుర్చీలు లేకపోవడంతో కటిక నేలపై నిద్రపోతున్న యాత్రికులు

రేషన్ ఈ కేవైసీ నమోదు గడువు పెంపు

దెందులూరు: రేషన్ ఈ కేవైసీ నమోదు గడువు ఈ నెల 10వతేదీ వరకు పెంచినట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రేషన్ ఈ కేవైసీ నమోదు గడువుపెంచిన సమాచారాన్ని ప్రతి కుటుంబానికి తెలియజేసేలా రెవెన్యూ సిబ్బంది కృషిచేయా లన్నారు. పెంచిన గడువు సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

2, 3 తేదీల్లో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

దెందులూరు: దెందులూరు మండలంలో స్వయం ఉపాధి పథకం కింద వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 2, 3 తేదీల్లో ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే శ్రీదేవి తెలిపారు. దరఖాస్తు చేసిన లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

ఉంగుటూరు తహసీల్దార్‌గా రవికుమార్

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దార్‌గా అమరావతి సెక్రటరీయేట్‌లో పనిచేస్తున్న పాలపర్తి రవికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల మందు రెగ్యులర్ తహసీల్దార్లు బదిలీలు కాగా ఆ తరువాత నుంచి పూర్తిస్థాయి తహసీల్దార్ లేక డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన డీటీ పూర్ణచంద్రప్రసాద్ నూతన తహసీల్దార్ రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించనున్నారు.

శ్రీపాటిమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: నియోజకవర్గంలో సంతాన లక్ష్మిగా పేరుపొందిన పెరుగుగూడెం గ్రామదేవత శ్రీ పాటిమ్మ పేరంటాలమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెరుగుగూడెం, చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెం గ్రామాల మధ్య వెలసిన అమ్మవారి ఉత్సవాలను ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాస్ ప్రారంభించారు. అమ్మవారు యలమర్తి వారి ఆడపడుచు కావడంతో పెరుగుగూడెం గ్రామం నుంచి 108 మంది ముత్తయిదువులు కళశాలతో పాటిమ్మ తల్లి ఆలయం వద్దకు గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. అనంతరం శ్రీపాటిమ్మ తల్లికి జలాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ శ్రీనివాస్, హేమలత దంపతులు, పావులూరి దశరథ రామయ్య,



అమ్మవారి ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాస్

అనూష దంపతులు, పర్వతనేని ప్రభాకర్ గంగా వరలక్ష్మి దంపతులు, ఆలయ డైరెక్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 3వ తేదీన శ్రీ పాటమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం ఆవరణలో నిప్పుల గుండం, 4వ తేదీన అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

మలేరియా జ్వరాలపై ఇంటింటి సర్వే

బుట్టాయగూడెం: మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వి. పెద్దిరాజు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల శివారు గ్రామమైన రామనర్సాపురంలో ఒక మలేరియా కేసు నమోదైందని చెప్పారు. దీనితో ఆ గ్రామంలో ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేసినట్లు చెప్పారు. అలాగే మలేరియా నమోదైన ఇంటి నుంచి 50 ఇళ్ల వరకూ మలాథియాన్ స్ప్రేయింగ్ పనులతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే దోమ



రామనర్సాపురంలో జ్వరాల నివారణకు రక్తపూతలు సేకరిస్తున్న దృశ్యం

కాటు నుంచి రక్షించుకోవడానికి తప్పనిసరిగా దోమతెరలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ పందిరి శ్రీను, ఎస్. శ్రీను, ఎంపీహెచ్ఏ బాలాజీ, రమేష్, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, కుమారి పాల్గొన్నారు.

ఎత్తు తగ్గించకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మించాలి

బుట్టాయగూడెం: ఎత్తు తగ్గించకుండా పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ శతవార్షికోత్సవం సందర్భంగా గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న జీప్ యాత్ర సోమవారం బుట్టాయగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతోపాటు అన్ని సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే గిరిజనులు పోడు భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఆ భూములకు పట్టాలిప్పించాలని కోరారు. గిరిజన సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, సీపీఎం మండల నాయకులు బేతి కిషోర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

భీమడోలు: ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు పవిత్రమైన రంజాన్ పండుగను ఆనందోత్సాహాల నడుమ జరిపారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను, అంబర్‌పేట, పాతూరు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శలు చేసి రంజాన్ విశిష్టతను చాటారు. భీమడోలు గ్రామంలో మసీద్ కమిటి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలంతా వక్ఫ్ బోర్డుపై కేంద్ర సవరణలను వ్యతిరేకిస్తూ పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శన చేశారు. ముస్లింల స్వేచ్ఛను హరించేలా ఉన్న సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారంతా భీమడోలు మసీదు వద్ద నుంచి వందలాది ముస్లింలు శాంతియుతంగా ర్యాలీ చేస్తూ పీర్ల చెర్వు ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ వారంతా మోకాళ్లపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీద్ ఇమామ్ దిల్షాద్ నేతృత్వంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించి పేదలకు ధానధర్మాలు చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ హసేనా, కమిటీ పెద్దలు సిద్ధిఖ్, రసూల్, షరీఫ్, జానీ, గాలిబ్, ముస్లిం పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.



భీమడోలు: వక్ఫ్ బోర్డుపై కేంద్రం సవరణలను వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలతో శాంతియుత ర్యాలీ, ప్రదర్శన చేస్తున్న ముస్లింలు



దెందులూరు: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దెందులూరులో...

దెందులూరు: దానధర్మాలు చేస్తూ పరమత సహనం కలిగి ఉండాలని అల్లా ఆజ్ఞలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని దెందులూరు మక్కా మసీద్ ఇమామ్ సద్దాం అన్నారు. సోమవారం దెందులూరులో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ప్రత్యేక నమాజు నిర్వహించారు.

పెదపాడు: మండలంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నమాజ్ వేళల్లో ముస్లిం సోదరులు నమాజ్ చేశారు. అల్లాను ప్రార్థించారు. మండలంలోని వసంతవాడ, తోటగూడెం, అప్పనవీడు, వట్లూరు పెదపాడు గ్రామాల్లోని మసీదుల్లో ఇమామ్‌లు ముల్లాలు ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేకంగా నమాజ్ చేశారు.

ఘనంగా అంతర్జాతీయ లింగమార్పిడి దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోణంగి రోడ్డులోని వైఎస్ఆర్ కాలనీలో సోమవారం అంతర్జాతీయ లింగమార్పిడి దినోత్సవాన్ని నిర్వహించారు. వికలాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహాయ కౌన్సెలర్, న్యాయవాది వెంకట్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులను గురించి తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు సింగిల్ రేషన్ కార్డులు, హిజ్రా సర్టిఫికెట్లు, ఇళ్ల స్థలాలు వచ్చే అవకాశాలపై వివరించారు. హిజ్రాలకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఆర్‌హెచ్ఈడీఎస్ సంస్థ ట్రాన్స్‌జెండర్స్ డే స్టాఫ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవునిపై విశ్వాసంతో జీవించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశ్వాసులు దేవుని పట్ల స్థిరమైన విశ్వాసంతో జీవించాలని అందుకు గురువులు కష్టపడి దేవుని సేవ, ప్రజా సేవ చేయాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర పిలుపునిచ్చారు. బిషప్ జయరావు గురు పట్టాభిషేక 33వ వార్షికోత్సవాల రెండో రోజు ప్రత్యేక కార్యక్రమాలు స్థానిక ప్రగతి నగర్‌లోని మోనాస్ట్రీ ఫాదర్ బేదంపూడి రాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మేత్రాసన ప్రొక్యూరేటర్ ఫాదర్ రాజు మాట్లాడుతూ బిషప్ జయరావు తన సేవా జీవితంలో ఎన్నో అడ్డంకులు, ఇబ్బందులు ఎదురైనా విశ్వాస పటిమతో ప్రార్థనా జీవితంతో వాటిని జయించి సేవల్లో ముందుకు సాగారన్నారు. వికార్ జనరల్ ఫాదర్ పీ. బాల మాట్లాడుతూ బిషప్ జయరావు ఉత్తమ పరిపాలనా దక్ష త కలవారని, ప్రేమతో సంఘాలను నడిపించారన్నారు. వరంగల్‌కు చెందిన బిషప్ కుటుంబ సభ్యులు రూపొందించిన పాటల సీడీని బిషప్ ఆవిష్కరించారు. ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ స్టీవెన్ థామస్, ఫాదర్ ఐ.మైఖేల్, కార్పొరేటర్ నిర్మల, విశ్వాసులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఫాదర్లు, గురువులు

బిషప్ జయరావుకు సత్కారం

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు 34వ గురు పట్టాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ బిషప్‌ను కలిసి సమిష్టి కృషితో ఆయన కోస్తా జిల్లాల్లో ఆధ్యాత్మిక విద్య, వైద్యం, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువా, జ్ఞాపకతో సత్కరించారు.

సంపద సృష్టి.. సర్వం నాస్తి

- నిరుపయోగంగా.. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు
- చెత్త సేకరణలో చేతులెత్తేసిన పంచాయతీలు

దెందులూరు: గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి ఎరువుగా తయారు చేసి సంపద సమకూర్చుకోవచ్చునని టీడీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. విధివిధానాలు స్పష్టమైన ప్రణాళిక లేకుండా ప్రభుత్వం చేపడుతున్న పనుల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం దుబారా కావడంతో పాటు నిర్మించిన యార్డు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ వేయకుండా ఒక్క చోటకు చేర్చి తద్వారా చెత్త నుంచి సంపద సష్టించాలనే ఆలోచన బాగానే ఉన్నా క్షేత్ర స్థాయిలో ఎంత వరకు సాధ్యమవుతుందో పట్టించుకోకుండా నిధులు ఖర్చు చేసేశారు.

ఎక్కడి చెత్త అక్కడే

ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించినప్పటికీ రోడ్డుపైనే చెత్త పేరుకుపోతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉండటంతో వ్యర్థాలను తొలగించే పని చేపట్టలేకపోతున్నారు. చెత్త సేకరించి సంపద తేవడం దేవుడెరుగు.. కనీసం చెత్తను తొలగించే ఏర్పాట్లను సైతం చేపట్టకపోవడంతో గ్రామాల్లో ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయి దోమల తాకిడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ముఖ్యమైన ప్రాంతాల్లో ఇబ్బందికరంగా పేరుకుపోయిన ఉన్న చెత్త చెదారాన్ని మాత్రమే తొలగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు నిధులు సమకూర్చి పనులు చేశామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప అని ప్రజలకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. దెందులూరు నియోజకవర్గంలో 85 గ్రామ పంచాయతీలున్నాయి. గత



చల్లచింతలపూడిలో ఖాళీగా ఉన్న చెత్త సేకరణ షెడ్డు



దెందులూరులో నిరుపయోగంగా చెత్త సేకరణ షెడ్డు తొట్టెలు

ప్రజలకు ఒరిగిందేమీ లేదు

చెత్త సేకరిచేందుకు వాహనాలు కూడా సమకూర్చలేకపోయారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బంది వాహనాలు జనాభాకు అనుగుణంగా లేక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. గ్రామాల ముఖ్య కూడళ్లలోని ప్రధాన రహదారులు, పంట కాలువల పక్కన చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

– కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

నిరుపయోగంగా షెడ్లు

లక్షలాది రూపాయలతో నిర్మించిన చెత్త సేకరణ షెడ్లు నిరుపయోగంగా మారాయి. స్వల్పంగా నిధులు వెచ్చించి తొట్లు తొలగించి శుభ్రంగా బాగు చేయించి కల్యాణ మండపాలుగా మార్పు చేస్తే కనీసం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు శుభకార్యాల నిమిత్తం ఉపయోగపడతాయి.

– బాలకృష్ణ, గ్రామ నాయకుడు, దెందులూరు

టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించారు. ఒక్కొక్క డంపింగ్ యార్డుకు రూ.7లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. ఈ లెక్కన సుమారు 4.5 కోట్లు నిధులు వెచ్చించారు. ఇప్పటికీ చెత్త సంపద కేంద్రాలు పూర్తి స్థాయిలో వినియోగించలేక ప్రజాధనం వృథా చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.